



దేశభక్తిలో ఎగువరామాపురం

- దేశరక్షణలో 105 మంది రామాపురం యువత
- కార్గిల్, ముంబై ముట్టడి వంటి కీలక ఆపరేషన్లలో మనోళ్లు

నాకు చాలా గర్వంగా ఉంది..



మా గ్రామానికి చెందిన వారు సుమారు 210 మంది దేశ సేవలో భాగస్వాములయ్యారు. కొందరు రిటైర్ అయ్యారు. మరికొందరు ఇప్పుడు విధులు నిర్వహిస్తున్నారు. మా తోటి వారు, మేమంతా కలిసి తిరిగినోళ్లు దేశ రక్షణలో భాగం కావడం చూసి మాకు చాలా గర్వంగా ఉంది. మా వాళ్లు ఇంతమంది దేశసేవలో పాల్గొనడం మా ఊరికే కాదు జిల్లాకే గొప్ప.

- వీరారెడ్డి, ఎగువ రామాపురం

మా ఊరికి ఎంతో పేరు తెచ్చారు..



మా ఊరి యువత ఆర్మీలో పనిచేస్తున్నారు. కార్గిల్ యుద్ధంలో పాల్గొన్నారు. ముంబైలో తీవ్రవాదులు హోటల్‌ను ముట్టడించారు. ఆ సమయంలో తీవ్రవాదులను అంతమొందించే ఆపరేషన్‌లో మా వాళ్లు పాల్గొన్నారు. ఆ సమయంలో మా ఊరి పేరు మారుమోగింది. అప్పుడు చాలా గర్వపడ్డాం.

- వై.అల్లూరిరెడ్డి, ఎగువ రామాపురం

మా ఊరిపేరు మారుమోగింది..



మా ఊరి పేరు ఎగువ రామాపురం. అయితే మా యువత వల్ల అది సైనికుల పురంగా మారిపోయింది. జిల్లాలో ఎక్కడా లేనివిధంగా పెద్ద ఎత్తున ఆర్మీలో ఉండేది మా పిల్లోళ్లే. పెద్ద యుద్ధాల్లో పాల్గొనడంతో మా ఊరి పేరు మోగిపోతూ వచ్చింది. అందుకే మా ఊరిని రామాపురం బదులు సైనికుల పురం అంటారు.

- బి.బాలఅంకిరెడ్డి

దేశంకోసం పనిచేయడం నా అదృష్టం..



నేను 16 ఏళ్లపాటు ఆర్మీలో పనిచేశా. దేశంలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వహించా. కీలకమైన ఆపరేషన్‌లో పాల్గొన్నా. భారతీయునిగా పుట్టి దేశ సేవలో నేను భాగస్వామ్యం కావడం అదృష్టంగా భావిస్తున్నా. రిటైర్ అయిన తరువాత ఇంటి వద్ద ఉంటూ వ్యవసాయ పనులు చేసుకుంటున్నాం.

- నాయబ్ రసూల్, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి


ఎగువ రామాపురం వ్యూ





(కడప-ఆంధ్రజ్యోతి): భరతమాత సేవకోసం, మన భూభాగంలో అల్లర్లు సృష్టించే ఉగ్రవాదులను తుదముట్టించే అవకాశం కోసం ఆ ఊరి యువత ఆతృతగా ఎదురు చూస్తుంటారు. అటు పాకిస్తాన్ ముష్కరులు పలుమార్లు ఉగ్రదాడులు చేసి పలువురిని బలిగొన్నప్పటికీ వారు మాత్రం బెదరరు. ఆర్మీనే లక్ష్యంగా ఉద్యోగాల వేటలో ఉంటారు. గ్రామానికి చెందిన కొందరు ఆర్మీ ఉద్యోగులు కార్గిల్‌వార్, ముంబై ముట్టడి లాంటి ఆపరేషన్లు.. ఇక జమ్ముకశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేతలో కీలకమైన కమాండ్ సెక్షన్‌లో ప్రాణాలు ఎదురొడ్డి బరిలో దిగి శత్రుమూకలను మట్టికరిపించారు. కీలకమైన ఆపరేషన్‌లో రామాపురం గ్రామానికి చెందిన యువత ఉండడంతో వారిని ఆదర్శంగా తీసుకుని ఆర్మీకి పోయేవారి సంఖ్య పెరుగుతోంది. నేడు ఆ ఒక్క గ్రామంలో 105 మంది దేశసేవలో పాల్గొంటున్నారు. అదే ఎగువరామాపురం ప్రత్యేకత. అది ఎక్కడో కాదు.. మన జిల్లాలో కలసపాడు మండలంలో ఉంది.

కలసపాడు మండలం ఎగువరామాపురంలో సుమారు 800 కుటుంబాలు ఉన్నాయి. ఇక్కడంతా వ్యవసాయ కుటుంబాలే. వ్యవసాయ కూలీలు ఉన్నారు. అయితే ఈ గ్రామం వ్యవసాయం కంటే ఆర్మీతోనే పేరు ప్రఖ్యాతులు తెచ్చుకుంది. ఈ గ్రామం నుంచి 35 ఏళ్ల క్రితం ఇద్దరో ముగ్గురో ఆర్మీలోకి వెళ్లేవారు. అప్పట్లో పాకిస్తాన్, చైనాలాంటి దేశాలతో యుద్ధం చేయాలి వామ్మో అంటూ భయపడేవారు. అణుబాంబు అంటూ ప్రచారం సాగింది. దీంతో మిలిటరీ అంటేనే భయపడే రోజులు. అలాంటి సమయంలో ఎగువరామాపురానికి చెందిన కొందరు యువకులు ఆర్మీలోకి అడుగుపెట్టారు. అప్పట్లో గుంటూరు, మద్రాసు, సికింద్రాబాద్‌లలో ఆర్మీ రిక్రూట్ మెంట్లు జరుగుతుండేవి. టెన్త్ పాసై ఆర్మీకి అవసరమైన శారీరక కొలతలు ఉన్నవారు ఆర్మీవైపు ఆసక్తి చూపేవారు. అలా అలా ఒకరిద్దరు వెళుతూ రావడం.. సెలవుల్లో ఇంటికి వచ్చిన సమయంలో పాకిస్తాన్‌తో జరిగిన కార్గిల్ యుద్ధం, జమ్ముకశ్మీర్‌లో తీవ్రవాదులు మనదేశంలోకి ఎంట్రీ, వారిని ఎలా మట్టుబెట్టింది ఇలాంటివన్నీ చెప్పడం విన్న యువకుల్లో ఆర్మీపై ఆసక్తి పెరిగింది. దీంతో సైన్యంలో చేరేవారు క్రమంగా పెరుగుతూ వచ్చారు. గ్రామానికి చెందిన 205 మంది ఆర్మీలో వివిధ స్థాయిలలో పనిచేశారు. ప్రస్తుతం 105 మంది కీలకమైన విభాగాల్లో పనిచేస్తున్నారు. వీరంతా జమ్ముకశ్మీర్, పూంచి, శ్రీనగర్, చైనా, పాకిస్తాన్ సరిహద్దు ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తున్నారు. రిటైర్ అయిన వారిలో కొందరు గ్రామంలో వ్యవసాయ పనులు చేసు కుంటుండగా మరికొందరు ఇతర ప్రభుత్వ ఉద్యోగాలు, బ్యాంకు సెక్యూరిటీ ఇతర విధుల్లో ఉన్నారు. కొందరు ఆర్మీలో 16, 17 సంవత్సరాలు పనిచేసి రిటైర్ అయ్యారు. పదవీ విరమణ తరువాత కూడా వీరికి మంచి ఆకర్షణీయమైన జీతంతో ఉద్యోగాలు దొరుకుతున్నాయి. స్కిల్‌ను బట్టి కొందరు టెక్నికల్ వైపు వెళితే మరికొందరు సెక్యూరిటీ వింగ్‌లో విధులు నిర్వహిస్తున్నారు.

కీలకమైన ఆపరేషన్లు

ఎగువరామాపురం సైన్యం దేశ రక్షణలో తమ ప్రతిభను చాటుకుంటూ వచ్చింది. మూడు దశాబ్దాల వ్యవధిలో పాక్ ముష్కరుల కోసం జరిగిన కీలకమైన ఆపరేషన్లలో ఎగువరామాపురం సైనికులు పాల్గొన్నారు. కార్గిల్ వార్‌లో గ్రామానికి చెందిన కరీం మరికొందరు పాల్గొన్నారు. ముంబైలోని తాజ్‌హోటల్‌ను ఉగ్రవాదులు ముట్టడించారు. సైన్యం బ్లాక్ కమాండర్లను దింపింది. అప్పట్లో ఎగువరామాపురం గ్రామానికి చెందిన సుబేదార్ దస్తగిరి సాహెబ్, ఎన్‌హెచ్‌జీ బ్లాక్ కమాండో బండి ప్రతాప్ రెడ్డి ఈ ఆపరేషన్‌లో పాల్గొని ముష్కరుల ఏరివేతలో ప్రతిభ చాటారు. ఇవే కాకుండా ఇక పాకిస్తాన్ సరిహద్దుల్లో ఉగ్రవాదుల ఏరివేతలో పనిచేసిన నాయబ్ రసూల్, రేనాటి వీరారెడ్డి, మరికొంత మంది గుర్తింపు తెచ్చుకున్నారు. అయితే కీలక ఆపరేషన్లే కాదు.. పొరుగు శత్రుదేశాల నుంచి భరతమాత భూభాగంలోకి ముష్కరుల అడుగు పడకుండా కంటికి రెప్పలా పహారా కాస్తున్నారు. శీతల ప్రదేశాలతో పాటు ఎడారులు, ఎత్తయిన కొండల్లో విధులు నిర్వహిస్తూ జిల్లా ఖ్యాతిని దేశవ్యాప్తంగా చాటుతున్నారు.







దేశాభివృద్ధిలో యువతే కీలకం

- నైతిక విలువలు కోల్పోతే సమాజమే సమాధి
- స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి

చెన్నూరు, ఆగస్టు14: యువత దేశాభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని తద్వారా దేశప్రగతి మరింత పెరిగే అవకాశం ఉందని స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా 77వ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలు చేసుకుంటున్న సందర్భంలో చెన్నూరు వాసి, 104 ఏళ్ల స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డిని ఆంధ్రజ్యోతి పలకరించగా ఆయన తన మనోభావాలు వెల్లడించారు.

ప్రజలు ముఖ్యంగా నైతిక విలువలు కోల్పోరాదని అన్నారు. నైతిక విలువలు కోల్పోతే సమాజమే సజీవసమాధి అయిపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లాలో జీవించి ఉన్న స్వాతంత్ర్య సమయోధుల్లో తాను ఒక్కడినే మిగిలానని అన్నారు. తనతో పాటు మండలంలో స్వాత్రంత్య సమరంలో పాల్గొన్న మరో 17 మంది దివంగతులు అయిపోయారన్నారు. నాడు బ్రిటీష దొరలతో దేశం అల్లకల్లోలమై అష్టకష్టాలు పడితే నేడు దేశంలో ఉంటూ దేశ ద్రోహానికి పాల్పడే కుట్రదారులతో భరతమాత విలపిస్తోందన్నారు. దేశంలో అధికారంలో ఉన్న నరేంద్రమోదీ భారతదేశ ప్రగతికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. ఆయన సారధ్యంలో దేశం కూడా ముందుకు వెళుతుందన్న విషయం పత్రికల్లో చదువుతున్నా టీవీలో చూస్తున్నానని అది ఎంతవరకు నిజమో తెలియదు కానీ వాస్తవ పరిస్థితుల్లో మాత్రం మరింత అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. అప్పట్లో బ్రిటీషు వారిని ఎదిరించి పోరాడామని, వారి చేష్టలను అడ్డుకున్నామని ఇప్పుడు అంతర్గతంగా ఉన్న దేశద్రోహులను ఏమీ చేయలేని పరిస్థితుల్లో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో యువత అన్నివిధాలా చైతన్యవంతులై తమను తాము మలుచుకుంటూ అభివృద్ధిలో భాగస్వాములై దేశసమగ్రతకు భావితరాలకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. జిల్లా ప్రజలకు స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

దండలు, దండాలతోనే సరి

స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డిని ఏటా జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు శాలువాలతో సత్కరించడం, మెడలో పూలదండలు వేయడం, నమస్కారాలు పెట్టడంతో సరిపెడుతున్నారు. జిల్లాలో జీవించి ఉన్న స్వాతంత్ర్య సమరయోధుడు ఆయన ఒక్కరే. ఆయన కుటుంబాన్ని ఆదుకోవడానికి ఏ అధికారీ, ప్రజాప్రతినిధి కృషి చేయలేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఆయన మనవడు ఉన్నత చదువులు చదువుకున్నా ఉద్యోగం ఇస్తామని కలెక్టర్లు, ఎస్పీలు హామీలు ఇచ్చారే తప్ప కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటికైనా స్వాతంత్ర్య సమరయోధుడి కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని కోరుతున్నారు.


స్వాతంత్ర్య సమరయోధుడు పెడబల్లె బాలయల్లారెడ్డి

పంచాయతీరాజ్‌లో బదిలీలకు కసరత్తు


- మూడు రోజుల నుంచి అధికారులు బిజీబిజీ
- ప్రభుత్వ ఆదేశాలేతరువాయి

కడప రూరల్, ఆగస్టు 14: జిల్లాలోని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలలో ఉద్యోగుల బదిలీలకు కసరత్తు జరుగుతోంది. ఈ మేరకు తాజాగా పీఆర్ అండ్ ఆర్డీ డైరక్టర్ కృష్ణతేజ్ బదిలీలకు సంబంధించిన వివరాలను సిద్ధంగా ఉంచాలని ఆయాశాఖల అధికారులకు సూచించారు. దీంతో పంచాయతీరాజ్ శాఖ పరిధిలోని జడ్పీ, డీపీవో, ఆర్‌డబ్ల్యూఎస్, పీఆర్, డ్వామా తదితర శాఖల జిల్లా అధికారులు మూడు రోజుల నుంచి బదిలీల జాబితా తయారీలో బిజీబిజీగా ఉంటున్నారు. ఆ యా శాఖల వారీగా మొత్తం ఎంతమంది ఉద్యోగులు ఉన్నారు, ఏయే క్యాడర్‌లో ఎంతమంది పనిచేస్తున్నారు. వీరిలో 3 ఏళ్లు, 5 ఏళ్లు సర్వీసు పూర్తిచేసిన వారు ఎంతమంది ఉన్నారు అన్న వివరాల సేకరణలో జిల్లా అధికారులు తలమునకలయ్యారు. ఇప్పటికే జడ్పీ, డీపీవో శాఖల బదిలీల జాబితాను పూర్తిచేసి సిద్ధంగా ఉంచారు.

జిల్లాప్రజాపరిషత్ శాఖలోని పలు విభాగాలలో 1,114 మంది అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. వీరిలో ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తిచేసిన వారు 438 మంది, మూడేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారు 311 మంది ఉన్నారు. ఇందులో విభాగాల వారీగా చూస్తే.. ఉమ్మడి కడప జిల్లాలోని 50 మండలాలకు గాను 42 మంది రెగ్యులర్ ఎంపీడీవోలు పనిచేస్తున్నారు. వీరిలో ఒకేచోట ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన వారు ఒక్కరు, మూడేళ్లు సర్వీసు పూర్తిచేసిన వారు ఆరుగురు ఉన్నారు. ఐదేళ్లు సర్వీసు పూర్తి చేసిన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్లు 16 మంది, సీనియర్ అసిస్టెంట్లు 27 మంది, జూనియర్ అసిస్టెంట్లు 60 మంది, టైపిస్టులు 12 మంది, రికార్డు అసిస్టెంట్లు 74 మంది, అటెండర్లు 116 మంది, వాచ్‌మెన్‌లు 131 మంది ఉన్నారు. డ్రైవర్లు ఏడుగురు ఉన్నా వీరు బదిలీల ప్రక్రియలోకి రాలేదు. ఈ మేరకు జడ్పీశాఖ అధికారులు జాబితాను సిద్ధం చేసి బదిలీలకు ప్రభుత్వ అనుమతి కోసం చూస్తున్నారు.

అలాగే జిల్లా పంచాయతీశాఖ (డీపీవో)లో ఆ శాఖ జిల్లా ఉన్నతాధికారి ప్రభాకర్‌రెడ్డి బదిలీల జాబితాను సిద్ధం చేశారు. శాఖలోని ఆయా విభాగాలలో ఐదు, మూడేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని గుర్తించారు. ఐదేళ్ల పూర్తి చేసిన వారిలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఒక్కరు, సీనియర్ అసిస్టెంట్ ఒక్కరు, జూనియర్ అసిస్టెంట్ ఒక్కరు, రికార్డు అసిస్టెంట్ ఒక్కరు, ఆఫీస్ సబార్డినేట్స్ ఒక్కరు మాత్రమే ఉన్నారు. ఇకపోతే గ్రేడ్-1, 2, 3, 4 పరిధిలో 400 మందికి పైగా పంచాయతీ కార్యదర్శులు ఉండగా బదిలీల జాబితాలోకి ఎంతమంది వచ్చేది గుర్తిస్తున్నారు.

పంచాయతీరాజ్‌శాఖలో ఎస్‌ఈ సుబ్బారెడ్డి బదిలీల జాబితాను తయారుచేసే పనిలో బిజీగా గడిపారు. ఈఈలు, డీఈలు, సూపరింటెండెంట్లు, జేఈలు, ఏఈల వారీగా ఐదు, మూడేళ్ల సర్వీసు పూర్తిచేసిన వారిని గుర్తించి బదిలీల జాబితాను సిద్ధం చేస్తున్నారు. అలాగే ఆర్‌డబ్లుఎస్‌శాఖలో కూడా బదిలీల జాబితాను సిద్ధం చేస్తున్నారు. ఇలా ఆయా శాఖల జిల్లా అధికారులు బదిలీల జాబితా తయారీలో బిజీబిజీగా ఉన్నారు.


బదిలీల జాబితాను పరిశీలిస్తున్న డీపీఓ ప్రభాకర్‌రెడ్డి

ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడాలి

- కలెక్టర్ లోతేటి శివశంకర్


మాట్లాడుతున్న కలెక్టర్ శివశంకర్, ఎస్పీ హర్షవర్ధన్ రాజు

కడప(కలెక్టరేట్/క్రైం) ఆగస్టు 14: జిల్లాలో ప్రతి ఇంటిపై జాతీయ పతాకం రెపరెపలాడాలని, స్వాతంత్ర్య దినోత్సవాన్ని దేశభక్తి ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ లోతేటి శివశంకర్ అధికారులను ఆదేశించారు. బుధవారం కడప పోలీసు పెరేడ్ మైదానంలో ఆగస్టు 15న నిర్వహించే స్వాతంత్ర్య దినోత్సవంలో భాగంగా భద్రత, బందోబస్తు, పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లపై ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, జేసీ అదితి సింగ్‌తో కలిపి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ అన్ని సచివాలయాల పరిధిలో ఇంటింటికీ తిరిగి జెండా ఆవిష్కరణ ఫొటోలు, వీడియోలను, అఫిషియల్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. స్వాతంత్ర్య వేడుకలకు హాజరయ్యే స్వాతంత్ర్య సమరయోధుల కుటుంబాలు, ఉన్నతాధికారులు, ప్రజలకు కల్పించాల్సిన సీటింగ్, ప్రతిభా పురస్కారాలు అందుకునే అధికారులు సిబ్బంది జాబితా, వివిధ శాఖల ప్రగతి రథాల ప్రదర్శన ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కృష్ణారావు, సుధాకర్, మున్సిపల్ కమిషనరు వైవి. నందన్, కడప ఆర్డీఓ వెంకటపతి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

ముస్తాబైన పోలీసు పరేడ్ గ్రౌండ్

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు జిల్లా కేంద్రం కడపలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. స్వాతంత్ర్య వేడుకల సందర్భంగా బుధవారం పోలీసుల రియల్ టైం ఫుల్ డ్రెస్ కవాతు రిహార్సల్స్‌ను నిర్వహించారు. ఇందులో భాగంగా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు జాతీయ జెండాను ఆవిష్కరించి వందనం చేశారు. అనంతరం కవాతు పరిశీలించి సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, అడిషనల్ ఎస్పీ ఎఆర్ ఎస్ఎస్‌వీ క్రిష్ణారావు, ఎఆర్ డీఎస్పీ మురళీధర్, ఆర్‌ఐలు ఆనంద్, వీరేశ్, శ్రీశైలరెడ్డి, టైటాస్, ఆర్‌ఎస్‌ఐలు పాల్గొన్నారు.

బాగా చదివి అత్యున్నత స్థానాలకు ఎదగాలి : ఎస్పీ



పోలీసు కుటుంబాల పిల్లలకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

కడప (క్రైం), ఆగస్టు 14: పోలీసు కుటుంబాల పిల్లలు బాగా చదివి అత్యున్నత స్థాయికి ఎదగాలని ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆకాంక్షించారు. బుధవారం స్థానిక పెన్నార్ పోలీసు కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పోలీసుల మరియు హోంగార్డ్స్ కుటుంబాలకు చెందిన విద్యలో ప్రతిభ కనబరిచిన 59 మంది పిల్లలకు మెరిట్ స్కాలర్‌షిప్‌లను, ప్రశంసాపత్రాలను ఎస్పీ అందించి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భవిష్యత్తులో మనసుకు నచ్చిన, మీరు ఎంచుకున్న రంగంలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. పోలీసు కుటుంబాలకు చెందిన వారు ఐఐటీ, ఎన్ఐటీలలో విద్యనభ్యసించి పలువురు అత్యున్నత స్థాయిలో ఉండడం సంతోషంగా ఉందని, పలువురు ఆలిండియా సర్వీస్ అధికారులుగా ఎంపిక కావడం అభినందనీయమన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు లోసారి సుధాకర్, ఎస్ఎస్ఎస్ క్రిష్ణారావు, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ యు.వెంకటకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త ఆందోళనకైనా సిద్ధం





- జూనియర్ డాక్టర్లు

కలకత్తాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారాన్ని నిరసిస్తూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో రిమ్స్ జూనియర్ డాక్టర్లు కదం తొక్కారు. ప్లకార్డులు చేతపట్టి వీరంతా పెద్దఎత్తున్న ర్యాలీగా వచ్చి కోటిరెడ్డి సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి హత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేదంటే దేశవ్యాప్త ఆందోళనకైనా తాము సిద్ధమని హెచ్చరించారు. వీరి ఆందోళనకు ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి మద్దతు తెలిపారు.

- కడప (సెవెన్‌రోడ్స్)



హ్యూండై మోటార్స్‌కి ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు ఎంపిక

వేంపల్లె, ఆగస్టు 14: హ్యూండై మోటార్ ఇండియా ఆర్‌అండ్ డీ విభాగంలో గ్రాడ్యుయేట్ ఇంజనీర్ ట్రైనీలుగా ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు నియమితులైనట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్త తెలిపారు. మార్చిలో జరిగిన ప్రాంగణ ఎంపికల ద్వారా ఇంటర్న్‌షిప్ సాధించి మూడు నెలల తర్వాత జీఈటీగా నియమితులయ్యారన్నారు. ట్రిపుల్‌ఐటీలో మెకానికల్ ఇంజనీరింగ్ పూర్తిచేసుకుని ఎంపికైన పి.నిహారిక, బి.ఉదయ్, కె.హేమంత్‌కు ఒక్కొక్కరికి రూ.5.50లక్షలు వార్షిక వేతనం అందుకుంటారని తెలిపారు. వారిని డైరెక్టర్ కుమారస్వామి గుప్త, ఏఓ డాక్టర్ రవికుమార్, అకడమిక్ డీన్ రత్నకుమారి, సీఈఓ రమేష్, మెకానికల్ ఇంజనీరింగ్ విభాగాధిపతి కొండారెడ్డి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ సుందర్, ప్లేస్‌మెంట్ సమన్వయకర్త వినోద్‌కుమార్ అభినందించారు.





చెత్తను ఆటోలకు ఇవ్వాలి : కమిషనర్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 14: ఇంట్లోని చెత్తను కాల్వలు, రోడ్లపై వేయకుండా క్లాప్ ఆటో (చెత్త సేకరణ ఆటో)కు ఇచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలని కమిషనర్ వైవోనందన్ తెలిపారు. బుధవారం అక్కాయపల్లె పార్కు, గాంధీ పార్కు, ఎర్రముక్కపల్లె జంక్షన్, గాంధీ ప్లాజా, భగత్‌సింగ్ పార్కులను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ కోటిరెడ్డిసర్కిల్ నుంచి బుగ్గవంక వరకు ఏర్పాటు చేసిన స్ట్రామ్ వాటర్ డ్రైన్ పనులు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఇంజనీరింగ్ విభాగ అధికారులను ఆదేశించారు. టీ బంకుల వద్ద డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు.


సిబ్బందిని ఆదేశిస్తున్న కమిషనర్

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

సికెదిన్నె, ఆగస్టు 14: ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమలాపురం ఎమ్మెల్యే పుత్తా చైతన్యరెడ్డి తెలిపారు. ఐసీడీపీ చాంపియన్ శివానందయాదవ్ ఊటుకూరు సర్కిల్‌లో ఏర్పాటు చేసిన మీసేవ సెంటర్‌ను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ యువనేత పుత్తా లక్ష్మిరెడ్డి, టీడీపీ నేతలు క్రిష్ణారెడ్డి, మోహన్‌బాబు, డీవీ సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి

కమలాపురం రూరల్, ఆగస్టు 14: ఎస్ఐగా ప్రతాప్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. చిత్తూరు జిల్లా చౌడేపల్లె పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న ఇతను సాధారణ బదిలీల్లో భాగంగా కమలాపురానికి వచ్చారు. శాంతిభద్రతలకు పరిరక్షణకు కృషి చేస్తానని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి ప్రజల సమస్యలు పరిష్కరిస్తామన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

కమలాపురం రూరల్, ఆగస్టు 14: ప్రతి రైతు పొలంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తే అధిక లాభాలు పొందవచ్చని ఏఓ సరస్వతి తెలిపారు. మీరాపురంలో గ్యాప్ పొలంబడిలో ఆమె మాట్లాడుతూ ఖరీఫ్‌లో ప్రతి బుధవారం (విత్తనం మొదలు కోత వరకు) పొలంబడి నిర్వహిస్తారు. ప్రతి రైతు పంటలు పండించే సమయంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటలు పండిస్తే అధిక లాభాలు పొందవచ్చన్నారు. రికార్డులు నిర్వహణ పక్కాగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మీరాపురం రైతు సేవా కేంద్రం వ్యవసాయ సంచాలకులు శివరంజని, ఇందిర, రైతులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణలు

కడప (నాగరాజుపేట), ఆగస్టు 14: విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు ఎంసీ నాగిరెడ్డి రచించిన శతక మధురిమలు, బంధాలు - బాధ్యతలు పుస్తకాలను 18న ఆవిష్కరిస్తున్నట్లు జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తెలిపారు. వానప్రస్థాశ్రమం, కడపలో జరిగే కార్యక్రమానికి పుస్తక సమీక్షకులుగా డాక్టర్ భూతపురి గోపాల క్రిష్ణశాస్త్రి, డాక్టర్ వెల్లాల వెంకటేశ్వరాచారి, ఆత్మీయ అతిథులుగా వానప్రస్థాశ్రమం కార్యదర్శి జి.సుబ్బిరెడ్డి, కోశాధికారి శివరామిరెడ్డి, జిల్లా రచయితల సంఘం కోశాధికారి డాక్టర్ కొప్పోలు రెడ్డి శేఖర్‌రెడ్డి పాల్గొంటారన్నారు.

డాక్టర్ వాసు గోవర్ధనరెడ్డికి జర్మన్ ఫెలోషిప్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 14: వైవీయూ కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు డాక్టర్ వాసు గోవర్ధనరెడ్డి ప్రతిష్టాత్మక అలెగ్జాండర్ వాన్ హంబోల్డ్ రెన్యూడ్ రీసెర్చ్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. జర్మనీలోని ఫౌండేషన్ పరిశోధకులకు అందించే అత్యంత గౌరవం. 12న అవార్డు ప్రకటిస్తూ అధికారిక నోటిఫికేషన్‌ను డాక్టర్ గోవర్ధనరెడ్డికి పంపారు. మే 1 నుంచి జూలై 31 వరకు ఆ దేశంలో పరిశోధన చేసేందుకు ఆహ్వానించింది. ఈయనకు మూడునెలల్లో నెలకు దాదాపు 3వేల యూరోలు నెలవారీ స్టైఫండ్‌ను అందిస్తారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

సింహాద్రిపురం, ఆగస్టు 14: నిడివెలగల ఆంజనేయస్వామి ఆలయంలో శ్రావణ మాస ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకులు మధుసూదన్‌రావు తెలిపారు. 16న వరలక్ష్మి వ్రత విశేష పూజల్లో భాగంగా సామూహిక వరలక్ష్మి వ్రతం, ముత్తైదువలు, కన్యకామణులచే పుష్ప పూజ, కుంకుమార్చన పూజలు, 19న సోమవారం ఉదయం ఆకు పూజ, విశేష అలంకరణ, అనంతరం సామూహికంగా సత్యనారాయణ వ్రతం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ లక్ష్మినారాయణరెడ్డి తెలిపారు. భక్తులు స్వామి వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

'వీసీ నియామకాన్ని వెనక్కి తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 14: వైవీయూ వైస్‌ఛాన్సలర్ నియమాకాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్, ఎన్ఎస్‌యూఐ జిల్లా కార్యదర్శి మామిళ్లబాబు డిమాడ్ చేశారు. బుధవారం కడపనగరం హోచిమన్ భవన్‌లో ఏర్పాటు చేసిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైవీయూ ఇన్‌చార్జ్ వైస్‌చాన్సలర్ లైంగిక వేధింపులకు పాల్పడ్డారని అటువంటి వ్యక్తిని వీసీగా నియమించడం సిగ్గుమాలిన చర్య అన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు కె.శివశంకర్, నాయకులు చంద్ర పాల్గొన్నారు.





మహారాజశ్రీ బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
S.O.P. No. 4/2024
కూరాకు సుబ్బరాయుడు S/o సంజీవయ్య వయస్సు 56 సం., డి.నెం. 4/86, అమృత నగర్, ప్రొద్దుటూరుటౌన్, వైఎస్ఆర్ జిల్లా. - పిటీషనరు
V/s
1) ది డిప్యూటి పోస్ట్‌మాస్టర్, కడపటౌన్, వైఎస్ఆర్ కడపజిల్లా, 2) ది బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ (ఆంధ్రబ్యాంక్), 7 రోడ్స్, కడపటౌన్, వైఎస్ఆర్ కడపజిల్లా. - రెస్పాండెంట్స్
పబ్లిక్ నోటీసు
పై నెంబరు కేసు రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, బద్వేలులో పిటీషనరు క్రింద కనబర్చిన పోస్టల్ మరియు బ్యాంక్‌ఫిక్స్‌డ్ డిపాజిట్స్‌లో వున్న అమౌంట్‌కుగాను పిటిషనరు అయిన కూరాకు సుబ్బరాయుడు వారసుడిగా డిక్లయిర్ చేయమని రాజశ్రీ కోర్టులో S.O.P. దాఖలు చేసినారు. సదరు S.O.P. పిటిషన్‌లో ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల 29-8-2024వ తేది రాజశ్రీ కోర్టుకు ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపుకొనవలసినది లేనియెడల పిటిషన్‌ను పరోక్షముగా తీర్మానించెదరు.
SCHEDULE :- 1) Fixed Depost of Rs. 4,50,000/- under monthly income scheme stands in the name of Kuraku Sayamma under account no. 4227100031, CIF No. 365252096. 2) Balance of Rs. 45257/- is available in savings bank account of Kuraku Sayamma under Account No. 4224983996, CIF No. 365252096 at Main Post Office, Kadapa. 3) Balance of Rs. 1,78,000/- is available in savings bank account of Kuraku Venkata Mahendra under account no. 008610100083976 at Union Bank (Andhra Bank) 7 Roads, Junction, Kadapa.
పి.వి.ఎస్.ప్రసాద్,
పిటిషనర్ తరపున అడ్వకేట్, బద్వేలు

డ్రోన్ స్ప్రేయర్లపై అవగాహన

వేంపల్లె, ఆగస్టు 14: ఇడుపులపాయలో నాబార్డు సహకారంతో సుస్థిర వ్యవసాయ కేంద్రం, ఏరువాక కేంద్రం కడప ఆధ్వర్యంలో డ్రోన్ స్ప్రేయర్లపై అవగాహన నిర్వహించారు. వరిపంటలో వచ్చే పురుగు తెగుళ్ల నివారణకు వేంపల్లె రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులు ఎకరాకు బయో పెస్టిసైడ్ మందుడ్రోన్ స్రేయర్ ద్వారా ఉచితంగా స్ప్రే చేయించారు. ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ అంకయ్య, నాబార్డు డీడీఎం విజయవిహారి పాల్గొన్నారు.


నేరాలపై అవగాహన అవసరం


వేంపల్లె, ఆగస్టు 14: ఆన్‌లైన్, సైబర్ నేరాలపై ప్రతి విద్యార్థి అవాహన కలిగి ఉండాలని సీఐ సురేష్‌రెడ్డి సూచించారు. స్థానిక అక్షర బాలికల జూనియర్ కళాశాలలో మహిళా భద్రత, రక్షణ, సైబర్ క్రైం, ఆన్‌లైన్ మోసాలు, ఆత్మహత్య నివారణ, ట్రాఫిక్ రూల్స్, మహిళా భద్రత యాప్‌పై విద్యార్థినులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ విజయ భారతి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి ఫరూక్‌ను కలిసిన అమీర్ బాబు

(కడప - ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టేట్ గెస్ట్‌హౌస్‌లో ముస్లిం మైనార్టీ మంత్రి షేక్ ఫరూక్‌ను బుధవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీఎస్ అమీర్‌బాబు కలిసి పుష్పగుచ్ఛం అందించారు. టీడీపీ నగర అధ్యక్షుడు సానపరెడ్డి శివకొండారెడ్డి, కడప నగర ఉపాధ్యక్షుడు కొండా సుబ్బయ్య, రాష్ట్ర వాణిజ్య విభాగం ప్రధాన కార్యదర్శి సానపురెడ్డి రవిశంకర్‌రెడ్డి, కడప తెలుగు యువత నగర మాజీ అధ్యక్షుడు మేకల వెంకటేశ్ యాదవ్, కడప నగర ఉపాధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది లింగాల శివశంకర్‌రెడ్డి, నగర మైనార్టీ మాజీ అధ్యక్షుడు ఇమ్రాన్, ఐ టీడీపీ, ఆర్ఎంపీ డాక్టర్ వరకుమార్, టీడీపీ మహిళా సీనియర్ నాయకురాలు ఘట్టమనేని శ్రీదేవి నాయుడు, టీడీపీ నేత రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మంత్రి ఫరూక్‌తో అమీర్‌బాబు, శివకొండారెడ్డి









ఆకట్టుకున్న 'హర్ ఘర్ తిరంగ' ర్యాలీ


ముప్పన్నెల జెండాతో ర్యాలీగా సాగుతున్న విద్యార్థులు

సికెదిన్నె, ఆగస్టు 14: కొలుములపల్లె పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు రమాదేవి ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగ ర్యాలీ ఆకట్టుకుంది. విద్యార్థులచేత జాతీయజెండా, జాతీయ నేతల ఫొటోలతో ర్యాలీ నిర్వహించారు. జాతీయ నేతల కృషిని అభినందిస్తూ విద్యార్థులు జేజేలు పలుకుతూ సాగారు. వివిధ అన్ని పాఠశాలల్లో హర్‌ఘర్ తిరంగ ర్యాలీని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో జాతీయ పతాకంతో ర్యాలీ


వేంపల్లె, ఆగస్టు 14: ప్రధాని మోదీ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగ ర్యాలీని వేంపల్లెలో కూటమి ఆధ్వర్యంలో నిర్వహించారు. జాతీయ పతాకంతో పురవీధుల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. భారత్ మాతాకీ జై అంటూ నినదించారు. పెద్దఎత్తున జాతీయ జండాను పట్టుకుని ర్యాలీ సాగించారు. కూటమి ప్రతినిదులు శశిభూషణ్ రెడ్డి, రఘునాథరెడ్డి, మునిరెడ్డి, సుష్మ, గాలి హరి, భద్ర, వేమా, మడక శ్రీను, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కొండవాండ్లపల్లెలో...

చక్రాయపేట, ఆగస్టు 14: గండి క్షేత్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల నుంచి కొండవాండ్లపల్లె వీధుల్లో ర్యాలీ ఘనంగా నిర్వహించారు. బుధవారం పాఠశాల ప్రిన్సిపాల్ సురేంద్ర బాబు, పీడీ యల్లారెడ్డి విద్యార్థులతో కలిసి త్రివర్ణ పతాకాలతో సమైక్యత నినాదాలతో ర్యాలీ చేపట్టారు. ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

కడపలో....

కడప (మారుతీనగర్) ఆగస్టు 14: స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ ఆవరణం నుంచి పురవీధుల్లో కోటిరెడ్డి సర్కిల్, పాత బస్టాండ్, ఏడురోడ్ల సర్కిల్ వరకూ భారీ ముప్పన్నెల జెండాతో విద్యార్థినీ, విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. నారాయణ విద్యాసంస్థల ఏజీఎం శ్రీనివాసులు, ప్రతినిధులు రామమోహన్‌రెడ్డి, రాజు, కిరణ్, రామకృష్ణ, రామ క్రిష్ణారెడ్డి, రెడ్డయ్యరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.















PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram Finance Ltd. Kadapa-II branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Tadigotla Narasimha Reddy** S/o Tadigotla Sura Reddy resident D.No. 4/163, near Ramalayam, pakkirupalle, Chinnachowk, Kadapa City, YSR Kadapa District by mortgage. As such if anyone has any claims, objections charges or mortgages sale agreements, court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 7days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the ragard. SCHEDULE OF THE PROPERTY : Kadapa Dt. Kadapa Urban Sub-Disrict, Kadapa City, within kadapa Municipal Corporation, Corporation Ward No. 83, Putlampalli, Madras Road, near Saibaba Temple, Padmasali Kalyana Mandapam, located in survey Nos.1 sub divided as 1/1 & 2 sub divided 2/1 of Putlampalle village fields an extent of Ac. 0.05 cents or 242 square yards BOUND -ARIES : EAST : Site of GL. Reddy, WEST: An extent of Ac. 0.05 cents, NORTH: Road, SOUTH: Site of Others

Yours faithfully
SHIAK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary

'అభివృద్ధి పనులతో ఉలికిపాటెందుకో'

కడప (మారుతీనగర్) ఆగస్టు 14: అభివృద్ధి పనులకు కడప ఎంఎల్ఏ ఆర్. మాధవిరెడ్డి ప్రారంభోత్సవాలు చేస్తుంటే వైసీపీ నేతలకు ఉలికిపాటెందుకని టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిరుమలేష్ ప్రశ్నించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విలేఖరులతో ఆయన మాట్లాడుతూ వైసీపీ పాలనలో అవినీతితో నిండిపోయిన వ్యవస్థలను ప్రక్షాళన చేసేలా జిల్లాలో టీడీపీ ఎంఎల్ఏలు, జిల్లా అధ్యక్షుడు అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతుంటే ఓర్వలేని వైసీపీ నేతలు విమర్శించడం విడ్డూరంగా వుందన్నారు. సమావేశంలో టీడీపీ నగర ఉపాధ్యక్షుడు పి. మన్సూర్ అలీఖాన్, టీఎన్ఎస్ఎఫ్ నేతలు, టీడీపీ డివిజన్ నేతలు పాల్గొన్నారు.

'ఆ ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి'

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 14: పూర్వపు ఆర్‌జేడీ అవినీతి అక్రమాలపై విచారణలో మరో ఉపాధ్యాయుడిపై దాడి చేసిన సంఘటనలో ఎఫ్ఐఆర్ నమోదైన నలుగురు ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌బీ, పీఎస్‌యూ విద్యార్థి సంఘాలు డిమాండ్ చేశాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వపు ఆర్‌జేడీ రాఘవరెడ్డికి మద్దతుగా వచ్చిన సుండుపల్లె ఎంఈఓ వెంకటేశ్‌నాయక్‌ను సస్పెండ్ చేసి మిగతా నలుగురు ప్రధానోపాధ్యాయులపై చర్యలు తీసుకోకపోవడం దుర్మార్గమన్నారు.



పది రూపాయిల నాణేలు చెల్లుబాటు అవుతాయి : కలెక్టర్

కడప(కలెక్టరేట్), ఆగస్టు 18: రిజర్వ్ బ్యాంకు విడుదల చేసిన 14 రకాల 10 రూపాయిల నాణేలన్నీ చెల్లుబాటవుతాయని కలెక్టర్ లోతేటి శివశంకర్ తెలిపారు. జిల్లాలో రూ.10 నాణేల అవగాహన కోసం డీసీసీ మీటింగ్‌లో తీసుకున్న నిర్ణయం మేరకు కెనరా బ్యాంకు రీజనల్ హెడ్ కె.మురళీమోహన్‌తో కలసి 7 రోడ్లకూడలిలో 16వ తేదీ పెద్దఎత్తున పది రూపాయిల నాణేలను చలామణి జరుపుతామన్నారు. రూ.10ల నాణెం చెల్లుబాటుపై గతంలో కూడా ప్రజల్లో అయోమయం నెలకొన్నపుడు... ఆర్‌బీఐ రూ.10 నాణేలన్నీ చెల్లుబాటవుతాయని అధికారికంగా ప్రకటించిందన్నారు. అన్ని జాతీయ బ్యాంకులు కూడా 10 రూపాయిల నాణేలపై ప్రజల సందేహాలను తీర్చినా... రూ.10నాణెం చెల్లదనే అపోహలు సామాన్యులు, వ్యాపారులు, దుకాణదారుల్లో ఉన్నాయన్నారు. ఈఅయోమయానికి తెరదించుతూ రూ.10 నాణెం చెల్లు బాటవుతుందన్నారు. ఎటువంటి సంకోచం లేకుండా అన్ని లావాదేవీల్లో రూ.10ల నాణేలను వినియోగించవచ్చని తెలిపారు.

కెనరా బ్యాంకు రీజనల్ మేనేజర్ మురళీమోహన్ మాట్లాడుతూ రూ.10ల నాణెం చెల్ల దంటూ జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని ప్రజలు నమ్మవద్దన్నారు. రూ.10 నాణెలను వర్తకులు తీసుకు నేందుకు అంగీకరించకపోవడం తగదన్నారు. 2009 మార్చి నుంచి 2017 జూన్ మధ్యలో ఆర్‌బీఐ ఇప్పటి వరకు 14 డిజైన్లలో రూ.10ల నాణేలను విడుదల చేసిందని, అన్ని రకాల లావాదేవీల్లో వీటిని ఉపయోగించుకోవచ్చని, ఎలాంటి ఆంక్షలు లేవన్నారు. ఇక బ్యాంకు సేవలు, పొదుపు ఖాతాలు, దేశ వ్యాప్తంగా సూక్ష్మ చిన్న, మధ్య తరహ పరిశ్రమలకు లభించే రుణాలపై అవగాహన కల్పించారు.

ముంపు పరిహారం త్వరగా ఇప్పించండి



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డి

కొండాపురం, ఆగస్టు 14: గండికోట ప్రాజెక్టు కింద మొదటి విడత 14 ముంపు గ్రామాలతో పాటు మిగిలిన గ్రామాలకు పెండింగ్‌లో ఉన్న పరిహారాన్ని త్వరగా ఇప్పించాలని టీడీపీ నాయ కులు, కార్యకర్తలు టీడీపీ ఇన్‌చార్జ్ భూపేశ్‌రెడ్డిని కోరారు. కొండాపురం టీడీపీ కార్యాలయంలో మండలంలోని కార్యకర్తలు, నాయకులతో బుధ వారం సాయంత్రం భూపేశ్ సమావేశం నిర్వ హించారు. అదేవిధంగా కొండాపురం రైల్వే స్టేషన్‌లో గతంలో మాదిరి రైళ్లను నిలుపుదల చేయాలని కోరారు. మంత్రి లోకేశ్ పాదయాత్రలో హామీ ఇచ్చిన విధంగా గండికోట ముంపు వాసుల కోసం పరిశ్రమ ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా పలువురు నాయకులు, కార్యకర్తలు స్థానిక సమస్యలను భూపేశ్ దృష్టికి తీసుకెళ్లారు.

సెంచురీ ప్లైవుడ్ పరిశ్రమలో స్థానికులకు అన్యాయం

బద్వేలు, ఆగస్టు 14: గోపవరం మండలంలో ఏర్పాటు చేసిన సెంచురీ ప్లైవుడ్ పరిశ్రమలో స్థానికులకు అన్యాయం జరుగుతోందని ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి పీవీ రమణ ఆరోపించారు. బుధవారం స్థానిక కార్యాలయంలో నిర్వహించిన సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీలో ఉద్యోగాల విషయంలో స్థానికులకన్నా ఇతర రాష్ట్రాల వారికే ప్రాధాన్యమిస్తున్నారని వాపోయారు. పలువురు స్థానికులు ఈ ఫ్యాక్టరీకి తమ భూములను త్యాగం చేసినప్పటికీ ఫలితం శూన్యమన్నారు. కార్యక్రమంలో సుబ్బరాయుడు, విజయ్, సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్యశిబిరాన్ని ప్రారంభిస్తున్న వీసీ క్రిష్ణారెడ్డి, రోటరీ క్లబ్ చైర్మన్ గోపాలక్రిష్ణ

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 14: వైవీయూలో కడప రోటరీ క్లబ్ సహకారంతో బుధవారం నిర్వహించిన మెగా వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. వైద్య శిబిరాన్ని వైస్‌చాన్సలర్ క్రిష్ణారెడ్డి, రోటరీక్లబ్ చైర్మన్ గోపాలక్రిష్ణలు ప్రారంభించారు. ఈసందర్భంగా వైస్‌చాన్సలర్ మాట్లాడుతూ నాలుగు ప్రధాన విభాగాల్లో వైద్యసేవలు అందించడానికి వచ్చిన డాక్టర్లను అభినందించారు. రోటరీ క్లబ్ సేవలు భవిష్యత్తులో కూడా యూనివర్శిటీకి అందించాలన్నారు. రోటరీక్లబ్ చైర్మన్ గోపాలక్రిష్ణ రోటరీ క్లబ్ సమాజానికి అందిస్తున్న సేవలను వివరించారు.

19న ఫొటోఎగ్జిబిషన్స్

కడప (ఎడ్యుకేషన్), ఆగస్టు 14: అంతర్జాతీయ 185వ ఫోటోగ్రఫీదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈనెల 19న ఫోటోల ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు ఇంటాక్ కడప చాప్టర్ కన్వీనరు లయన్ కె.చిన్నపరెడ్డి, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షుడు ఎ.వెంకటసుబ్బయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్ధనరాజు, ఏపీ ఫొటో స్టూడియో గ్రాఫర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు పద్మప్రియ చంద్రారెడ్డి తెలిపారు. బుధవారం టూరిజం సంస్థ కార్యాలయంలో ప్రదర్శనకు సంబంధించిన ప్రచార పోస్టర్లను వారు విడుదల చేశారు. సోమవారం ఉదయం 9.30 గంటలకు హౌసింగ్‌బోర్డు కాలనీలోని కోదండ రామాలయంలో ఫొటోల ప్రదర్శన ఉంటుందని వివరించారు. కలెక్టరు శివశంకర్ ముఖ్య అతిధిగా హాజరై ప్రదర్శనను ప్రారంభిస్తారన్నారు. సాయంత్రం 5 వరకు ప్రదర్శన ఉంటుందన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత



వల్లూరు ఆగస్టు 14: మండల పరిధిలోని గోటూరు నుంచి కడప వైపునకు అక్రమంగా ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. తమకు వచ్చిన సమాచారం మేరకు గోటూరు వద్ద మాటువేసి బియ్యం సహా ఆటోను స్వాధీనం చేసుకున్నారు. ఆటోలో 29 మూటలు (1450 కేజీలు) బియ్యం వున్నట్లు వెల్లడించారు. కాగా పట్టుకున్న ఆ బియ్యాన్ని రెవెన్యూ అధికారులకు అప్పగిస్తూ, నిందితుడిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి నట్లు పోలీసులు తెలిపారు.


వెల్లాల ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ



వెల్లాల సంజీవరాయస్వామి పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే వరద

రాజుపాలెం, ఆగస్టు 14: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వెల్లాల సంజీవ రాయ చెన్నకేశవస్వామి దేవస్థానంలో ఆలయ పునఃనిర్మాణానికి బుధ వారం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరద రాజులరెడ్డి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదా యశాఖ కామన్ గుడ్ ఫండ్ ఫేజ్ -1 కింద రూ.3.55 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఈ నిధులతో సంజీవరాయస్వామి ఆలయ గర్భగుడి, విమాన గోపురం, అర్థమండపం, ముఖ మండపాన్ని నిర్మించడం జరుగుతుందన్నారు. అనంతరం ఆలయ నిర్మా ణానికి సంబంధించి డిజైన్ పరిశీలించి.. దేవదాయశాఖ ఎస్‌ఈ సతీష్, ఈఈ గంగయ్య, డీఈ శ్రీనివాసులతో మాట్లాడారు. ఆలయం నిర్మాణం పూర్తి చేయాలంటే ఎంత మేర నిధులు అవసరం అవుతాయని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరుకు కృషి చేస్తామన్నారు. ఆలయ నిర్మాణంలో నాణ్యత లోపం లేకుండా నిర్మించాలని కాంట్రాక్టరుకు సూచించారు. అంతకు ముందు ఆలయ అర్చకులు వరదరాజులరెడ్డికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే వెల్లాల గురుకుల పాఠ శాల, వృద్ధాశ్రమాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఎస్‌ఈ సతీష్, ఈఈ గంగయ్య, డీఈ శ్రీనివాసులు, ఈవో నరసయ్య, తహసీల్దారు వెంకటేశ్వర్లు, టీడీపీ నాయకులు తోట మహేశ్వర్‌రెడ్డి, ధనిరెడ్డి రామచంద్రారెడ్డి, లక్ష్మినారాయణరెడ్డి, మాజీ దేవస్థాన చైర్మన్‌లు చంద్రశేఖరరెడ్డి, రామసుబ్బారెడ్డి, వెంకట్రామిరెడ్డి, టీడీపీ నాయకులు మానికింది ఖాదర్‌బాషా, కొట్టాల జగన్ మోహన్‌రెడ్డి తది తరులు పాల్గొన్నారు.

రూ.11.76 లక్షల చెక్‌ను కలెక్టర్‌కు అందజేసిన కెనరా బ్యాంకు ఆర్‌ఎం



కలెక్టర్ శివశంకర్‌కు చెక్‌ను అందజేస్తున్న కెనరా బ్యాంకు ప్రతినిధులు

కడప(కలెక్టరేట్) ఆగస్టు 14: 78వ స్వాతంత్ర్య దినోత్సవాల్లో భాగంగా కెనరా బ్యాంక్ డాక్టర్ అంబేడ్కర్ విద్యాజ్యోతి స్కాలర్‌షిప్ ప్రదానోత్సవం ద్వారా 5 నుంచి 10 తరగతుల వరకు ప్రతిభ కనబరిచిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌లు అందజేస్తుంది. ఇందుకు సంబంధించిన రూ.11.76 లక్షల చెక్‌ను కలెక్టర్ శివశంకర్‌కు కెనరా బ్యాంకు రీజనల్ మేనేజరు మురళీమోహన్ బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు. రీజనల్ మేనేజరు మాట్లాడుతూ సామాజిక సేవలో భాగంగా కెనరా బ్యాంకు కడప ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని శాఖల ద్వారా 294 మంది ఎస్సీ, ఎస్టీ విద్యా ర్థినులకు రూ.11.76 లక్షలను పంపిణీ చేసిందన్నారు. కెనరా బ్యాంకు దేశ వ్యాప్తంగా ఏటా జరిపే వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. కార్య క్రమంలో డివిజనల్ మేనేజరు రమేష్, ఎల్డీఎం జి.జనార్థనం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ మద్యం దుకాణంలో చోరీ



మద్యం దుకాణం వద్ద విచారణ చేస్తున్న డీఎస్పీ మురళి

పులివెందుల టౌన్, ఆగస్టు 14: మున్సిపాలిటీ పరిధిలోని కదిరి రోడ్డులో ఉన్న ప్రభుత్వ మద్యం దుకాణంలో మంగళవారం రాత్రి చోరీ జరిగింది. ఉదయం మద్యం దుకాణంలో పనిచేసే సెక్యూరిటీ గార్డు షట్టర్ ఓపెన్ చేయగా.. వెనుకవైపు ఉన్న షట్టర్ ఓపెన్ చేసి ఉండడం గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. అప్పటికే దుకాణంలో ఉన్న రూ.4,23,160 చోరీకి గురైందని, పది మద్యం బాటిళ్లు కూడా ఎత్తుకెళ్లారని తెలిపారు. సంఘటన స్థలానికి డీఎస్పీ మురళి నాయక్, ఎస్‌ఐ అనిల్ కుమార్‌లు చేరుకొని పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం అక్కడ పనిచేసే సిబ్బందిపై విచారించారు. అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. కాగా, పులివెందులలో ఇటీవల కాలంలో చోరీలు ఎక్కువగా జరగడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి దొంగత నాలను అరికట్టాలని కోరుతున్నారు.

సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండుకళ్లు : ఎమ్మెల్యే



అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి

పెండ్లిమర్రి, ఆగస్టు 14: సంక్షేమం, అభివృద్ధి టీడీపీకి రెండు కళ్లని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. ఎగువపల్లెలో బుధ వారం అంగన్వాడీ కేంద్రాన్ని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ అభివృద్ధి ఎక్కడ ఆగిపోయిందో అక్కడి నుంచే మళ్లీ మొదలు పెడుతున్నారన్నారు. ఐదేళ్ల కిందట పూర్తయిన అంగన్వాడీ బిల్డింగ్ కేవలం టీడీపీ ప్రభుత్వంలో కట్టారన్న ఉద్దేశంతో ప్రారంభించలేదన్నారు. భవనం నిర్మించిన కాంట్రాక్టర్‌కు కూడా బిల్లు చెల్లించలేదన్నారు. అలాంటి దారుణమైన పరిస్థితిలో వైసీపీ ప్రభుత్వంలో ఉండేవన్నారు. ఈ రోజు రాష్ట్ర ప్రజలు వైసీపీని ఓడించి టీడీపీని కోరుకున్నారన్నారు. అధికారంలోకి రాగానే సంక్షేమం అభివృద్ధి పనులు మొదలయ్యాయన్నారు. ఉచిత బస్సు, అన్నక్యాంటీన్‌లు గురువారం నుంచి మొదలవుతాయన్నారు. అంగన్వాడీ కేంద్రం చిన్నపిల్లలకు అందుబాటులోకి వచ్చిందని పౌష్టికాహారాన్ని పిల్లలకు అందజేయాలన్నారు. గడచిన ఐదేళ్లలో సీసీరోడ్లు కాల్వలు కానీ ఎక్కడ ఏర్పాటు చేయలేదని వచ్చే వారంలో సీసీరోడ్లు కాల్వలు తాగునీటి సమస్యలాంటి పనులు మొదలవుతాయన్నారు. ఈ పంచాయతీ ప్రజలు మాపై నమ్మకంతో ఓట్లు వేశారని గతంలో కంటే ఎక్కువ ఓట్లు ఇక్కడ వచ్చాయన్నారు. మీరు మాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా మాటలు నిలబెట్టుకుంటామన్నారు. అనంతరం కాల్వ పనులను పరిశీలించారు. టీడీపీ యువనేత పుత్తా లక్ష్మిరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు గంగిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి కిషోర్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి చంద్ర ఓబుళ్‌రెడ్డి, కార్పొరేషన్ మాజీ ఫ్లోర్ లీడర్ విశ్వనాథ రెడ్డి, మండల టీడీపీ నేతలు విజయ్‌సారథిరెడ్డి, పవన్ కుమార్‌రెడ్డి, రాజశేఖర్, నారాయణరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, బాలుడు, చిన్నారెడ్డి, వెంకటసుబ్బయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా అన్నమయ్య కీర్తనలు ఆలాపన

మదనపల్లె అర్బన్, ఆగస్టు14: మదనపల్లె పట్టణం లో నిర్వహిస్తున్న ముందస్తు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం సాయంత్రం టీటీడీ ఆస్థాన గాయని శోభరాజుచే అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవ కమిటీ ఆధ్వ ర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆమె మాట్లా డుతూ అన్నమయ్యజిల్లాలోని తన స్వంత గడ్డపై స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో పాల్గొనడం ఆనం దంగా ఉందన్నారు. అన్నమయ్య కీర్తనలు మదన పల్లె పరప్రజలు ఆసక్తితో, భక్తిశ్రద్ధలతో విన్నారు. కార్యక్రమంలో మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్ బాషా తోపాటు స్వాతంత్ర్య దినోత్సవ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కడప (క్రైం), ఆగస్టు 14: కడప నగరంలోని అగాడివీధికి చెందిన షేక్ కరీముల్లా(55) అనే వ్యక్తి ఈ నెల 13న మంగళవారం సాయంత్రం ఇంటిలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్య ఖదీరున్నీసా వివరాల మేరకు.. తన భర్త ఆటో నడుపుతూ జీవించేవాడని, మద్యానికి బానిసగా మారి ఈ చర్యకు పాల్పడినట్లు తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టూటౌన్ పోలీసులు తెలిపారు.

6 ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

వల్లూరు, ఆగస్టు 14: ఎలాంటి అనుమతులు లేకుండా పాపాఘ్ని నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 6 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ లీలావతి తెలిపారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో బుధవారం రాత్రి తన బృందంతో దాడులు నిర్వహించి పెద్దపుత్త, పైడికాల్వ మార్గమధ్యదాడులు చేసి 6 ఇసుక ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అనధికార ప్లాట్లు కొని మోసపోవద్దు : కమిషనర్



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ రమణారెడ్డి

పులివెందుల రూరల్, ఆగస్టు 14: పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని అనధికార లేఅవుట్లపై చట్టపర చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి ఆదేశించారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

బుధవారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో పులివెందులలో అక్రమ లేఅవుట్ల దందా అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో స్థానిక కార్యాలయంలో వార్డు, పట్టణ, ప్రణాళికా కార్యదర్శులు, టౌన్‌ప్లానింగ్ అధికారులకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఎక్కడైనా అనధికార లేఅవుట్లు వేయకుండా చర్యలు తీసుకోవాలన్నారు. లేఅవుట్ నియమాలు ఉల్లంఘించి ఇదివరకే గుర్తించిన లేఅవుట్ యజమానులపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు అక్రమ లేఅవుట్‌లలో ప్లాట్లు కొని మోసపోవద్దని, కొత్త అనధికార లేఅవుట్లలో కొన్నప్లాట్లకు ఇంటి నిర్మాణ అనుమతి మంజూరు చేయ మన్నా రు. కావున ప్రజలు ప్లాట్లు కొనేముందు... విధిగా విచారించుకోవా లన్నారు. టౌన్‌ప్లానింగ్ అధికారి అజయ్‌కుమార్, క్లర్క్ అలీం పాల్గొన్నారు.

40 మద్యం బాటిళ్లు పట్టివేత

బ్రహ్మంగారి మఠం, ఆగస్టు 14: మండల కేంద్రంలోని ఐదు రోడ్ల కూడలిలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించి 40 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. అరెస్టు అయిన వారిలో బాలనరసింహులు, నరసింహులు వద్ద ఒక్కొక్కరి నుంచి 20 బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చంద్రశేఖర్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకునికి తీవ్ర గాయాలు

కలికిరి, ఆగస్టు 14: పట్టణంలోని యల్లమ్మ ఆలయం వద్ద ఆర్టీసీ బస్సు, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఘటనలో ఈశ్వరయ్య (21)అనే యువకుడు తీవ్ర గాయాలకు గుర య్యాడు. బుధవారం జరిగిన ఈ సంఘటనకు సంబం ధించిన వివరాలు.. సోమల నుంచి కలికిరి వస్తున్న ఆర్టీసీ బస్సు ఒక ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. కలికిరి నుంచి గుట్టపాలెం పంచాయతీ సి.బరిణేపల్లెకు చెందిన ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంలో స్వగ్రామం వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనం వెనుక కూర్చున్న ఈశ్వరయ్య బస్సు కింద పడిపోవడంతో ఒక కాలు పూర్తిగా నుజ్జునుజ్జయ్యింది. వాహనం నడుపుతున్న మరో యువకుడు రాజేష్‌కు కూడా గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన ఈశ్వరయ్యకు స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స చేయించిన అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. కలికిరి సీఐ ఆదేశాల మేరకు గాయపడ్డ రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఏఎస్‌ఐ మధుసూ దనాచారి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కేరళ బాధితుల కోసం విరాళాల సేకరణ



బద్వేలు, ఆగస్టు 14 కేరళ వరద బాధితులకోసం బుధవారం సీపీఎం ఆధ్వర్యంలో సహాయ నిధి సేకరించినట్లు ఆ పార్టీ పట్టణ కార్యదర్శి శ్రీను తెలిపారు. కేరళలోని వయనాడ్ ప్రాంతంలో వరదలు రావడంతో దాదాపు 300 మంది పైబడి చనిపోయాన్నారు. వారి కుటుంబాలను ఆదుకునేందుకు సహాయ సహకారాలు అందించేందుకు విరాళాలు సేకరించి జిల్లా కేంద్రానికి పంపిస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చిన్ని, కొండయ్య, ఆంజనేయులు, బాలస్వామి, సుబ్బరాయుడు, మోక్షమ్మ, అనంతమ్మ తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తిమృతి



యల్లారెడ్డి (ఫైల్‌ఫొటో)

బద్వేలుటౌన్, ఆగస్టు 14: పట్టణంలోని ఓ లాడ్జిలో పిల్లి యల్లారెడ్డి (36) అనే వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందారు. మృతుని స్వగ్రామం చెన్నూరు అయినప్పటికీ కడపలో ఉన్నట్లు సమాచారం. మూడు రోజుల క్రితం బద్వేలులో పనినిమిత్తం లాడ్జి తీసుకుని అక్కడే ఉంటున్నాడు. రోజూలాగే లాడ్జికి సమయానికి వెళ్లడం, రావడం జరిగేది. బుధవారం ఉదయం ఎంత సేపటికీ తలుపులు తీయకపోవడంతో లాడ్జిలో పనిచేసే వ్యక్తికి అనుమానం వచ్చి తలుపులు తీయడంతో యల్లారెడ్డి మంచంపై మృతి చెంది ఉన్నాడు. వెంటనే లాడ్జి సిబ్బ ంది పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు సీఐ రాజగోపాల్ సంఘటనా స్థలానికి చేరుకుని లాడ్జికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతుడి ఆధార్‌కార్డు ప్రకారం వారి బంధువులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బాలిక ఆత్మహత్య కేసు దర్యాప్తు ప్రారంభం

పెద్దమండ్యం, ఆగస్టు14: పెద్దమండ్యం మండలం పరిధి లోని అటవీ ప్రాంతంలో తంబళ్లపల్లి మండలం ఉగవ బోయపల్లికు చెందిన హరినాధ్ కూతురు శ్వేత (17) అనుమానాస్పద స్థితిలో అత్మహత్య, కేసుపై బుధవారం ములకలచెరువు సీఐ మధు, తంబళ్లపల్లి ఎస్‌ఐ, పెద్ద మండ్యం ఇన్‌చార్జ్ ఎస్‌ఐ శివకుమార్ దర్యాప్తు ప్రారం భించారు. మృతురాలు తండ్రి హరినాథ్‌ను పెద్దమం డ్యం పోలీసు స్టేషన్‌కు పిలిపించి విచారించారు. వీఆర్వో, వీఆర్ఏలతో పోలీసులు మాట్లాడి విరాలను సేకరించారు. అనంతరం అనుమానస్పద స్థితిలో బాలిక మృతి చెందిన సంఘటన స్థలాన్ని, మృతదేహాన్ని దహనం చేసిన ప్రాంతాన్ని పరిశీలించి దహనం లో మిగిలిన చిన్న చిన్న ఎముకల నమూనాలను సేకరించారు. తం బళపల్ల మండలం ఎగువ బోయపల్లిలో స్థానికులతో అధికారులు మాట్లాడారు. గత నెల 27వ తేది తం బళ్లపల్లి పోలీసు స్టేషన్‌లో శ్వేత తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. దాంతో పోలీసులు బాలిక ఆచూకీ కనుగొని ఆమెను తహసీల్దార్ సమక్షంలో తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ నెల 9వ తేదిన ఇంటి నుంచి వెళ్లి పోయి పెద్దమండ్యం మండలం బండ్రేవు సమీపంలో అటవీ ప్రాంతంలో శవమై తేలింది. కేసు దర్యాప్తు సాగుతున్నట్లు పోలీసులు వెల్లడించారు.

అథ్లెటిక్ జాతీయ స్థాయి క్రీడలు ముగింపు

మదనపల్లె అర్బన్, ఆగస్టు14: వలసపల్లె పంచాయతీలోని జవ హర్ నవోదయ విద్యాలయ సమితి లో నిర్వహిస్తున్న రీజనల్ స్థాయి అథ్లెటిక్స్ జాతీయ స్థాయి క్రీడలు బుధవారంతో ముగిశాయి. ఈ మీట్‌లో 258 పాయింట్లతో కాసరగడ్ క్లస్టర్ మొదటి స్థానంలో, 150 పాయింట్లతో బళ్ళారి క్లస్టర్ రెండో స్థానంలో 162 పాయింట్లతో చిత్తూరు క్లస్టర్ మూడవ స్థానంలో నిలిచాయి. ఈ క్రీడల ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా మదనపల్లె సబ్‌కలెక్టర్ పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు ఎంపికైన విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఇక్కడ ఎంపికైన క్రీడాకారులు రాంచిలోని ఖేల్గావ్‌లో ఈ నెల 28నుంచి 30 వరకు జరగబోవు నవోదయ నేషనల్ పోటీలలో హైదరాబాద్ రీజియన్‌కు ప్రాతినిధ్యం వహిస్తారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోవిందరావు, వైస్‌ప్రిన్సిపాల్ వేలాయుధన్, క్రీడా ఉపాధ్యాయులు సురేంద్రరెడ్డి, కొటాయి, అధ్యాపకులు సిబ్బంది పాల్గొన్నారు.

17న ఉపాధి హామీ సామాజిక తనిఖీ

మైదుకూరు రూరల్ ఆగస్టు 14 : ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 17వ తేదీన ఉపాధిహామీ పథకం సామాజిక తనిఖీ ఉంటుందని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నాగరాజు తెలిపారు. సర్పంచ్‌లు,ఉపాధి సిబ్బంది, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని కోరారు.

ప్రతి ఇంటా జాతీయ జెండా ఎగురవేయాలి

జమ్మలమడుగు, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా జమ్మలమడుగు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమం పాత బస్టాండులోని గాంధీ విగ్రహం వద్ద నుంచి ప్రారంభమైంది. ముందుగా టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు అనంతరం అధికారులు, నాయకులు నివాళులు అర్పించారు. అక్కడి నుంచి కూరగాయల మార్కెట్‌వీధి, కాపువీధి, పలగాడి సెంటర్, పెద్దపసుపుల మోటు, సంజాముల మోటు మీదుగా పాత బస్టాండు చేరుకున్నారు. పాత బస్టాండులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆర్డీవో శ్రీనివాస్ ప్రసంగించారు. ప్రతి ఇంట జాతీయ జెండా ఎగురవేయాలని (హర్‌ఘర్ తిరంగ) కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి , డీఎస్పీ హుసేన్‌పీరా, సీఐ కరుణాకర్, ఎస్ఐ రామక్రిష్ణ, సుబ్బారావు, కల్పన, జనసేన నాయకుడు నాగార్జున, టీడీపీ నాయకులు వంగల నాగేంద్రయాదవ్, బిర్రు సంతోష్, సద్దాం, రజక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నప్ప, బేపారి మహ్మద్ రఫి, ఎంఈవో చంద్రశేఖర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగుంట్ల..: ఎర్రగుంట్లలో బుధవారం అధికారులు, విద్యార్థులు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. స్థానిక ముద్దనూరు రోడ్డులోని బాలుర ఉన్నత పాఠశాల నుంచి తహసీల్దార్ శోభన్ బాబు, కమిషనర్ రామక్రిష్ణయ్య, సీఐ నరేష్‌బాబు తదితరులు విద్యార్థులతో కలిసి ర్యాలీని ప్రారంభించారు. నాలుగురోడ్ల కూడలిలో మానవహారం ఏర్పాటు చేసి స్వాతంత్ర్య దినోత్సవ ప్రాధాన్యత వివరించారు.హెచ్ఎం రామాంజనేయరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



జమ్మలమడుగు పాత బస్టాండులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

బద్వేలు..: దేశ ప్రధాని పిలుపు మేరకు పట్టణంలోని వీరారెడ్డి కళాశాలలో హర్‌ఘర్‌తిరంగ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో పాల్గొన్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకట సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఎంతోమంది త్యాగధనుల ఫలితమే నేటి స్వాతంత్ర్యమన్నారు. ప్రతి ఇంటిపై జెండా ఎగురవేయాలనే లక్ష్యంతో ఈ ర్యాలీని నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా ఎన్ఎస్‌వలంటీర్లతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కార్యకర్తలు డాక్టర్ దొరస్వామినాయక్, ఈశ్వరయ్య, మహేష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీ లీల జ్యువెలర్స్ ప్రారంభం

ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 14 : స్థానిక ఎర్రగుంట్ల రోడ్డులోని వాసవి సర్కిల్ వద్ద శ్రీ లీల జ్యువెలర్స్ షాపును ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి ప్రారంభించారు. ఉదయం 9.30 గంటలకు ఆయన షాపును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ ఆర్గనైజింగ్ సెక్రెటరీ సీఎం సురేష్‌నాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి వీఎస్ ముక్తియార్, సినీహబ్ అధినేత బసిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి హాజరై శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని ప్రముఖులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు హాజరయ్యారు.



శ్రీలీల జ్యువెలర్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చర్యలు

● అధిక ధరలకు వస్తువులు అమ్మితే లైసెన్స్‌లు రద్దు చేయిస్తాం : పుట్టా



పెచ్చులు ఊడిన బిల్డింగ్‌లను పరిశీలిస్తున్న పుట్టా

మైదుకూరు రూరల్ ఆగస్టు 14 : మైదుకూరు ఆర్‌టీసీ బస్టాండ్‌ను ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఇటీవల బస్టాండ్ ఆవరణలో ఆర్‌టీసీ బస్సు ఢీకొని ఒక వ్యక్తికి తీవ్రగాయాలవడంపై విషయం తెలుసుకొన్న పుట్టా ఆకస్మిక తనిఖీ చేశారు. బస్టాండ్‌లో స్లాబు అంతా పెచ్చులు ఊడటాన్ని పరిశీలించారు. పెచ్చులు ఊడి ప్రయాణికులపై పడితే పరిస్థితి ఏంటని డిపో మేనేజర్ జనార్దన్‌ను ప్రశ్నించారు.అంతేకాకుండా ప్రయాణికులు తాగునీటి కోసం మినరల్ వాటర్ మిషన్‌ను ఏర్పాటు చేయాలని తెలిపారు. అంతేకాకుండా మెయిన్ రోడ్డు నుంచి బస్టాండ్‌లోకి బస్సులు వచ్చే ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు వేయాలని తెలిపారు. బస్టాండ్‌లో అంగళ్ల యజమానులు కచ్చితంగా వస్తువుల రేట్ల పట్టికను షాపు బయట అందరికీ కనింపించేలా ఉంచే విధంగా చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు, చాపాడు మండలాధ్య క్షుడు అన్నవరం సుధాకర్ రెడ్డి,మండలాధ్యక్షుడు భీమయ్యఏపీ రవీంద్ర, బీఎన్ శ్రీనివాసులు తదతరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు డీఎస్పీగా భక్తవత్సలం



ప్రొద్దుటూరు క్రైం, ఆగస్టు 14 : ప్రొద్దుటూరు డీఎస్పీగా భక్తవత్సలం బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు.గంజాయి, మద్యం, ఇసుక అక్రమ రవాణాకు ఎవ్వరు పాల్పడినా చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా 1991 బ్యాచ్‌కు చెందిన ఈయన పలుచోట్ల పనిచేశారు.

తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐగా హృషికేశ్వర్‌రెడ్డి

కొండాపురం, ఆగస్టు 14 : మండలంలోని తాళ్ల ప్రొద్దుటూరు పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ గా జి.హృషికేశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. 2020 బ్యాచ్‌కు చెందిన ఈయన గతంలో లింగాల,కమలాపురం పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ గా పనిచేశారు. అనంతరం బదిలీ పై కమలాపురం నుంచి ఇక్కడకు వచ్చారు.

రాజుపాలెం ఎస్ఐగా వెంకటరమణ

రాజుపాలెం, ఆగస్టు 14 : రాజుపాలెం ఇన్‌స్పెక్టరుగా బుధవారం వెంకటరమణ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్ఐ తులసి నాగ ప్రసాద్ సింహాద్రిపురం బదిలీ కావడంతో వల్లూరులో ఎస్ఐగా పనిచేస్తున్న వెంకటరమణ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

మహారాజశ్రీ బద్వేలు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

S.O.P. No. 4/2024

కూరాకు సుబ్బరాయుడు S/o సంజీవయ్య వయస్సు 56 సం., డి.నెం. 4/86, అమృత నగర్, ప్రొద్దుటూరుటౌన్, వైఎస్ఆర్ జిల్లా. - పిటిషనరు

V/s

1) ది డిప్యూటి పోస్ట్‌మాస్టర్, కడపటౌన్, వైఎస్ఆర్ కడపజిల్లా, 2) ది బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ (ఆంధ్రబ్యాంక్), 7 రోడ్స్, కడపటౌన్, వైఎస్ఆర్‌కడపజిల్లా. - రెస్పాండెంట్స్

పబ్లిక్ నోటీసు

పై నెంబరు కేసు రాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు, బద్వేలులో పిటిషనరు క్రింద కనబర్చిన పోస్టల్ మరియు బ్యాంక్‌ఫిక్స్‌డ్ డిపాజిట్స్‌లో వున్న అమౌంట్‌కుగాను పిటిషనరు అయిన కూరాకు సుబ్బరాయుడు వారసుడిగా డిక్లయిర్ చేయమని రాజశ్రీ కోర్టులో S.O.P. దాఖలు చేసినారు. సదరు S.O.P. పిటిషన్‌లో ఎవరికైనా ఆక్షేపణలున్న యెడల 29-8-2024వ తేది రాజశ్రీ కోర్టుకు ఉదయం 10.30 గంటలకు హాజరై తెలుపుకొనవలసినది లేని యెడల పిటిషన్‌ను పరోక్షముగా తీర్మానించెదరు.

SCHEDULE :- 1) Fixed Depost of Rs. 4,50,000/- under monthly income scheme stands in the name of Kuraku Sayamma under account no. 4227100031, CIF No. 365252096. 2) Balance of Rs. 45257/- is available in savings bank account of Kuraku Sayamma under Account No. 4224983996, CIF No. 365252096 at Main Post Office, Kadapa. 3) Balance of Rs. 1,78,000/- is available in savings bank account of Kuraku Venkata Mahendra under account no. 008610100083976 at Union Bank (Andhra Bank) 7 Roads, Junction, Kadapa.

పి.వి.ఎన్.ప్రసాద్,
పిటీషనర్ తరపున అడ్వకేట్, బద్వేలు